క్లుప్తంగా

తహసీల్దార్ భరత్ మృతికి సంతాపం



మౌనం పాటిస్తున్న డిప్యూటీ తహసీల్దార్, ఇతర సిబ్బంది

కూడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భరత్‌కుమార్ మృతిపై సంతాపం తెలియజేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. భరత్‌కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సూర్య ప్రతాప్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, వీర్వోలు రమేష్, మల్లికార్జున, టైపిస్టు నారాయణ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభ

రాయదుర్గంటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ అనంతపురం జిల్లా శాఖ, రాయదుర్గం జోన్ ఆధ్వర్యంలో ఈనెల 1న స్వర్ణోత్సవ మహాసభ జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, స్థానిక అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు యూటీఎఫ్ స్వర్ణోత్సవ ర్యాలీ, 10 గంటలకు పతాకావిష్కరణ అనంతరం సభ జరుగుతుందన్నారు.

ఎస్సీ, ఎస్టీలు చైతన్యవంతులు కావాలి

కూడేరు: ఎస్సీ, ఎస్టీలు చట్టాలుపై అవగాహన పెంచుకొని చైతన్యవంతులు కావాలని డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్ సూచించారు. శనివారం మండలంలోని కడదరకుంట దళితవాడలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ చట్టాలపై డిప్యూటీ తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఏఎస్ఐ రామానాయుడు, బాయ్స్ హాస్టల్ వార్డెన్ గురుప్రసాద్, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

నారాయణస్వామి సేవలు మరువలేనివి



నారాయణస్వామి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కళ్యాణదుర్గం రూరల్: ఉపాధ్యాయుడు రాపా నారాయణస్వామి సేవలు మరువలేనివని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు అన్నారు. శనివారం పట్టణంలోని మారంపల్లి కాలనీలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో రాపా నారాయణస్వామి ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంఈఓ విజయకుమారి, ఉపాధ్యాయ సంఘం నాయకులు బొమ్మయ్య, చెన్నకేశవ పాల్గొన్నారు.

నేడు లక్ష దీపోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం, స్వయంభూ జంబుకేశ్వరస్వామి,నగరేశ్వరస్వామి ఆలయం, మార్కండేయస్వామి ఆలయం, నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో కార్తీకమాస అమవాస్యను పురస్కరించుకుని ఆదివారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

చలిలో వెచ్చని నేస్తం

- ఎముకలు కొరికే చలితో జనం గజగజ
- వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో అప్రమత్తత అవసరం
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు
- జోరుగా ఉన్ని దుస్తుల వ్యాపారం



ఉరవకొండలోని పోలీసు స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారి వద్ద దుప్పట్లు, స్వెట్టర్ల షాపు

ఉరవకొండ /రాయదుర్గం టౌన్: నవంబర్ నెల నుంచే ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. దీంతో సాధారణం కంటే రెండు డిగ్రీలు తక్కువ నమోదవుతున్నాయి. దీంతో చలి చంపేస్తోంది.. వేకువజాము నుంచే మంచుకప్పేస్తోంది. ఉదయం 9 గంటల వరకు చలి వణికిస్తుండడంతో కొందరు మంటలు వేసుకొని చలి కాచుకుంటుంటే.. మరి కొందరు చలికి బయటకు రాలేకపోతున్నారు. దీంతో ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో ఉన్నిదుస్తులకు గిరాకీ పెరిగింది. రకరకాల డిజైన్లతో స్వెటర్లు, రెయిన్‌కోట్లు, శాలువాలు, మంకీ క్యాప్‌లు,మఫ్లర్‌లు, గ్లౌజులు, బెడ్‌షీట్లు ఉంచి విక్రయిస్తుండడంతో కొనుగోలుదారులతో దుకాణాలు కిక్కిరిస్తున్నాయి.

చలికాలంలో వ్యాధులు వచ్చే అవకాశం..

చలి కారణంగా జ్వరం వంటిపై దద్దుర్లు రావచ్చు. దగ్గు, ముక్కు కారడం, శ్వాస సంబంధిత సమస్యలు, గొంతునొప్పి, తుమ్ములు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి లక్షణాలు ఉన్న చిన్నారుల ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఏర్పడి నిమోనియా బారిన పడే అవకాశం ఉంది. వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్, ప్రోటోజోవాల వల్ల శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడుతాయని వైద్యులు చెప్తున్నారు. గాలితోపాటు సూక్ష్మజీవులు శరీరంలో ప్రవేశించి తెల్ల రక్తణాలను నిర్వీర్యం చేయడంతో రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సంబంధిత వ్యాధికి గురై ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది.



రాయదుర్గంలో చలి కాచుకుంటున్న దృశ్యం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

- చిన్న పిల్లలు వెచ్చగా ఉండానికి స్వెటర్లు వేసి చెవులకు వెచ్చదనం కోసం టోపీ పెట్టాలి. వీలైతే కాళ్లు, చేతులకు సాక్సులు, గ్లౌజ్‌లు వేయాలి.
- పాలు తాగే నెలల వయసు గల చిన్నారులను తల్లి పొత్తిళ్లలో పడుకోబెడితే వెచ్చదనం వస్తుంది. ఉదయం ఎండలో కొద్దిసేపు ఉంచితే బాగుంటుంది.
- పిల్లలకు అవసరమైన అన్ని రకాల టీకాలు ఇప్పించాలి.
- రాత్రి వేళల్లో చల్లగాలి రాకుండా ఇంట్లో కిటికీలు, తలుపులు మూసి వేసి వెచ్చదనం కోసం వేడినిచ్చే హైవోల్టేజీ బల్బులను వేయాలి
- ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వాడకూడదు.
- కాచి చల్లార్చిన నీటిని తాగించాలి.
- కూల్‌డ్రింక్స్, ఇతర తినుబండారాలకు దూరంగా ఉంచాలి.
- శరీరానికి వేడినిచ్చే రాగులు, సజ్జలు, జొన్నలతో చేసిన ఆహారపదార్థాలు, ఆకుకూరలను అధికంగా తీసుకోవాలి.
- అత్యవసరమయితే తప్ప రాత్రి వేళ బయటకు వెళ్లరాదు. వెళ్లాల్సివస్తే ఉన్ని దుస్తులు ధరించాలి.



చలి నుంచి రక్షణ పొందుతూ స్వెట్టర్లు, దుప్పట్లు కప్పుకున్న చిన్నారులు

జోరుగా ఉన్ని దుస్తుల విక్రయం:

ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలో సుమారు 30 చోట్ల రోడ్ల వెంబడి రంగు రంగుల ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరుకు వివిధ డిజైన్లలలో ఈవిక్రయాలు జోరందుకున్నాయి. చిన్న చిన్న వ్యాపారులు చేసుకుంటే కుటుంబాలు పోషించుకుంటున్నామని, మాకు తెలిసిన స్వెటర్ల తయారీ మమ్మల్ని ఈదేశ ప్రజలందరికీ పరిచయం చేసి, మాపై నమ్మకాన్ని పెంచిందని వ్యాపారులు అంటున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, కోయంబత్తూరు ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి దుకాణాలు ఏర్పాటు చేసుకొని పిల్లలు, పెద్దలకు సంబంధించిన అన్ని రకాల ఉన్ని దుస్తులు, టూ ఇన్‌వన్ రెయిన్ కోట్లు (రెగ్జిన్) బెడ్‌షీట్లు విక్రయిస్తున్నారు. ప్రధాన రహదారుల పక్కనే వీటిని విక్రయిస్తు ఉంచే ప్రాంతాల్లోనే ఇండ్లు బాడుగకు తీసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. ఏటా నవంబర్ నెలలో వచ్చి ఫిబ్రవరి వరుకు వ్యాపారాలు చేస్తుంటారు.

ధరలు ఇలా:	
స్వెట్టర్లు	రూ. 400 నుంచి రూ.1,500
రెయిన్‌కోట్లు	రూ.1000 నుంచి రూ.1,500
శాలువాలు	రూ.300 నుంచి రూ.600
మంకీ క్యాప్‌లు	రూ. 80 నుంచి రూ.150
మఫ్లర్	రూ.50 నుంచి రూ.200
గ్లౌజులు	రూ.100 నుంచి రూ.200
బెడ్ షీట్లు (రగ్గులు)	సింగల్: రూ 600

నాణ్యమైన దుస్తులు విక్రయిస్తున్నాం



మేము నాణ్యమైన ఉన్ని దుస్తులే విక్రయిస్తాం. ధరలు కుడా ఫిక్స్‌డ్‌గా ఉంటాయి. ఏటా నవంబర్ మొదటి వారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వ్యాపారం చేస్తాం. మాపై కస్టమర్లు మంచి ఆదరణ చూపిస్తున్నారు. – రవి, మధ్యప్రదేశ్

చలికాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



చలికాలంలో చిన్న పిల్లలు, వృద్ధులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా చిన్న పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. చలి వల్ల జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస సంబంధిత సమస్యల బారిన పడే ప్రమాదం ఉంటుంది. ఉన్ని దుస్తులు ధరించాలి. ఆహార పదార్థాలు వేడిగా ఉన్నప్పుడు తీసుకోవాలి. పిల్లలకు ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింక్‌లు, ఫ్రిడ్జ్ వాటర్‌కు దూరంగా ఉంచాలి. చిన్న పిల్లలు అస్వస్థతకు గురైన వెంటనే పిల్లల వైద్య నిపుణులను సంప్రదించి వైద్య సేవలు పొందాలి.

– డాక్టర్ ఉమామహేశ్వర్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, ఏరియా ఆస్పత్రి, రాయదుర్గం

మెనూ పక్కాగా అమలు చేయాలి



గూళ్యపాళ్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ తిమ్మప్ప

వజ్రకరూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పక్కగా అమలు చేయాలని ఎంఈఓ తిమ్మప్ప ఆదేశించారు. శనివారం మండలంలోని గూళ్యపాళ్యం ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకోసం వండిన ఆహార పదార్థాలను రుచి చూశారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. అనంతరం తట్రకల్లు ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఈనెల 8న జరగనున్న పేరెంట్స్, టీచర్స్ సమావేశ ఏర్పాట్లు పరిశీలించారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం



ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి వినీత

ఉరవకొండ: ఎయిడ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిణి వినీత సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో ఎయిడ్స్‌ను నిర్మూలించాలంటూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరమేష్, డాక్టర్ వెంకటరాముడు, డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా అంజన్న పూల రథోత్సవం



నేమకల్లు అంజన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం కార్తీక దీపోత్సవం, పూల రతోత్సవం నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ స్వామి, సంతోష్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష తులసీమాల అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. రాత్రి 9 గంటలకు పూల రథోత్సవం లాగారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహారెడ్డి, సిబ్బంది ఒబన్న, అన్నదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూల రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



తులసీదళం అలంకరణలో నేమకల్లు అంజన్న

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్



దివ్యాంగ బాలుడికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. శనివారం స్థానిక కోటవీధిలో పింఛను దారులకు నగదు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

కూడేరు: మండలంలో శనివారం తొలిరోజు పింఛన్ పంపిణీ చేశారు. మండలంలోని 5,578 మంది పింఛన్‌దారులకు రూ.2,40,66,000 మంజూరైనట్లు ప్రత్యేకాధికారి సత్యనారాయణ చౌదరి, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి తెలిపారు.

బ్రహ్మసముద్రం: మండలంలో సూగేపల్లి, కోనాపురం తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ నందకిశోర్ ప్రారంభించారు. మొదటిరోజు శనివారం 5,320 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా గ్రామాల్లో 5,819 మందికి పింఛన్ పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ శనివారం తెలిపారు.

పశుగణన వేగవంతం చేయండి

బొమ్మనహాళ్: పశుగణన వేగవంతం చేయాలని పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డివిజనల్ సంయుక్త సంచాలకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో జరుగుతున్న పశుగణన సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి గాయాలు

గుమ్మఘట్ట: మండలంలోని గుమ్మఘట్ట గ్రామ సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామ సచివాలయ ఉద్యోగి సందీప్ గాయాలపాలయ్యాడు. పింఛన్ పంపిణీ కోసం ద్విచక్ర వాహనంపై గుమ్మఘట్టకు వెళ్తుండగా అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం గుమ్మఘట్ట పీహెచ్‌సీ తరలించగా మెరుగైన చికిత్స కోసం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

పాఠశాల నిర్వహణ నిధులు మంజూరు

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠశాల నిర్వహణ నిధులు మంజూరయినట్లు ఎంఈఓ ఎర్రిస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలం లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీకి నిధులు వచ్చినట్లు తెలిపారు.

'పీఎం ఫసల్ బీమా'ను సద్వినియోగం చేసుకోండి

వజ్రకరూరు: మండలంలోని రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (2024–25) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మధుకర్ తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయకార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రబీ సీజన్‌కు సంబంధించి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం

సంక్షిప్త సమాచారం

ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పప్పుశనిగ పంటకు ఎకరాకు రూ. 450 ప్రీమియం చెల్లించాలని, బోరుబావుల కింద వేరుశనగ పంటకు రూ.480 చెల్లించాలని తెలిపారు. డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు.

సమాజానికి దిక్సూచి గురువు

- మాజీ మంత్రి రఘువీరారెడ్డి



వేణుగోపాల్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి

కుందుర్పి: అక్షరదానం చేసిన గురువు సమాజానికి దిక్సూచి అని మాజీ మంత్రి రఘువీరారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బండమీదపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వేణుగోపాల్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. రఘువీరారెడ్డి మాట్లాడుతూ అన్ని స్థానాలకన్నా గురువు స్థానం గొప్పదన్నారు. ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ చరమాంకం లాంటిదన్నారు. విధి నిర్వహణలో చేసిన సేవలు ఎప్పటికీ మిగిలిపోతాయన్నారు. గురుజాడ అప్పారావు వర్ధంతి రోజున వేణుగోపాల్ రెడ్డి ఉద్యోగ విరమణద పొందడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిప్పేస్వామి, ఓబుళపతి, గ్రామ సర్పంచ్ మారుతేశ్వరీ, సింగిల్ విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక మాస పూజలు



రాయదుర్గం మార్కండేయస్వామి ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శివాలయాలతోపాటు ప్రముఖ ఆలయాల్లో కార్తీక మాసోత్సవ పూజలు నిర్వహించారు. కార్తీక చివరి శనివారాన్ని పురస్కరించుకొని మార్కండేయస్వామి ఆలయంలో రంగా, మేడం వంశీయుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. నగరేశ్వరస్వామి, జంబుకేశ్వరస్వామి, చన్నవీరస్వామి, నీలకంఠేశ్వరస్వామి , బసవేశ్వరస్వామి, వీరభద్రస్వామి, చంద్రమౌళేశ్వరస్వామి, బసవేశ్వరస్వామి, రేవణసిద్దేశ్వరస్వామి, శనీశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక దీపారాధణ, పూజలు జరిగాయి.

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో శనివారం కార్తీకమాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని నగరేశ్వరస్వామి, భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకాలు చేశారు. జరుట్లరాంపురంలోని జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు చేశారు. కొనకొండ్ల గ్రామంలోని ఛాయామల్లేశ్వర స్వామి ఆలయంలోనూ పూజలు చేశారు.

సీతారామస్వామి ఆలయంలో విశేషపూజలు

స్థానిక బలిజవీధిలోని సీతారామస్వామి ఆలయం, జనార్ధనవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర పూజలు చేశారు.

మార్మోగిన అంజన్న నామస్మరణ

కూడేరు: మండలంలోని బసాపురం, కూడేరు ఆంజనేయ స్వామి ఆలయాల్లో కార్తీక మాస చివరి శనివారం కావడంతో పెద్ద ఎత్తున పూజలు చేశారు. భక్తులు అభిషేకం, ఆకుపూజ కట్టించి, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బసాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో అంజన్న ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

లత్తవరం ఉమామహేశ్వర ఆశ్రమానికి కార్తీక శోభ

ఉరవకొండ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి తెలిపారు. శనివారం తాలుకా జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లత్తవరంలోని శంకరానందగిరి ఆశ్రమంలో కార్తీక వనభోజన మహోత్సవం, శివుడికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తీక వేడుకల్లో ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారితో పాటు పాల్తూరు కల్లుహోళమఠం పీఠాధిపతులు చెన్నవీర శివచార్యస్వాములు, ప్రణానందగిరి స్వామి, మహేశ్వర నందగిరిస్వాములు హాజరయ్యారు. అనంతరం ఆశ్రమంలోని చంద్రమౌళీశ్వర స్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆశ్రమంలోని ఉసిరి చెట్ల కింద వందలాది మంది కార్తీక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుడిబండయ్య, ఉపాధ్యక్షులు రాచప్పయ్యస్వామి, బసవరాజు, రుషేంద్రస్వామి, రాజన్నస్వామి, రాఘవేంద్రస్వామి, మంజునాథ్ పాల్గొన్నారు.



గవిమఠం ఉత్తరాధికారితో పాటు పీఠాధిపతులను హారతులు, పూర్ణకుంభంతో స్వాగతిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో వడ్డేపాళ్యం గుడిబండ ఆంజనేయస్వామి

కుందుర్పి: మండల వ్యాప్తంగా వివిధ పురాతన ఆలయాల్లో శనివారం కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గుడిబండ ఆంజనేయస్వామి ఆలయం, కుందుర్పి శివాలయం, కోదండరామస్వామి ఆలయం, లక్ష్మీవేంకటేశ్వర ఆలయం, తూముకుంట హరిహరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, లక్షదీపోత్సవాలు నిర్వహించారు.



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



వజ్రకరూరులో అలంకరణలో భోగేశ్వరస్వామి



వజ్రకరూరులోని రామేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

బ్యాంకు ఉద్యోగికి సన్మానం



నాగరాజు దంపతులను సన్మానిస్తున్న ఆర్ఎం శ్రీదేవి, ఉద్యోగులు

బెళుగుప్ప: స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న క్యాషియర్ నాగరాజు ను సన్మానించారు. శనివారం స్థానిక ఏపీజీబీ మేనేజర్ ముస్తఫా ఆధ్వర్యంలో ఉద్యోగవిరమణ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఏపీజీబీ ఆర్ఎం శ్రీదేవి మాట్లాడుతూ నాగరాజు విధుల పట్ల అంకితభావంతో ఉండేవారన్నారు. అందరితో కలసిమెలసి ఉండేవారన్నారు. అనంతరం నాగరాజు, భాగ్యలక్ష్మి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు నూతన క్యాషియర్ లోకేష్, ఫీల్డ్ ఆఫీసర్ నితీష్, సిబ్బంది సత్యప్ప, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.